## 'సకుర' సైన్స్ ప్రోగ్రామ్‌కు గొల్లపల్లి విద్యార్థిని



కలికోట శ్రీజ

జగిత్యాల/ గొల్లపెల్లి, జూలై 28 : గొల్లపెల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థిని కలికోట శ్రీజ రాష్ట్ర స్థాయి 'సకుర' సైన్స్ ప్రోగ్రామ్ పోటీలకు ఎంపికైంది. జపాన్ దేశంలో నవంబర్‌లో నిర్వహించే అంతర్జాతీయ వైజ్ఞానిక పోటీల్లో పాల్గొనే విద్యార్థుల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయిలో జిల్లాలోని 13 ఆదర్శ, రెండు రెసిడెన్షియల్, మూడు కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో గొల్లపెల్లి విద్యార్థిని ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 33 జిల్లాల నుంచి 33 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరందరికీ రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి ఐదుగురు విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసి జపాన్ దేశంలో జరిగే సైన్స్ ప్రోగ్రామ్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షలకు న్యాయనిర్ణేతలుగా డీసీఈబీ సెక్రటరీ మురళీమనోహర చారి, డీవీ రామకృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి విద్యార్థిని, పాఠశాల ప్రిన్సిపాల్‌ను అభినందించారు.



దవాఖానలో గాయపడిన కార్మికుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్, టీబీజీకేఎస్ నాయకులు

## అధికారుల నిర్లక్ష్యంతోనే గని ప్రమాదాలు

- మాజీ ఎమ్మెల్యే చందర్
- టూఇంక్లైన్ గని ప్రమాద బాధితులకు పరామర్శ

గోదావరిఖని, జూలై 28: సింగరేణి ఆర్జీ-1 పరిధిలో ఇటీవల జరుగుతున్న వరుస ప్రమాదాలకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మండిపడ్డారు. ఆదివారం జీడీకే టూఇంక్లైన్ గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడి సింగరేణి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న శంకర్, నోయల్ కార్మికులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని బాధిత కుటుంబాలకు మనోధైర్యం కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గని కార్మికుల ప్రాణాలతో యాజమాన్యం చెలగాటమాడుతోందన్నారు. ప్రమాద కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణి అధికారులు సీఎం, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవడానికే పని చేస్తున్నట్లు కనబడుతోందన్నారు. కార్మికుల భద్రత ప్రమాణాలను పాటించడం లేదన్నారు. ఇక్కడ టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రామమూర్తి, వడ్డెపల్లి శంకర్, చెల్పూరి సతీశ్, జెవి రాజు, పర్లపల్లి రవి, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, చెలకలపల్లి శ్రీనివాస్, శేషగిరి కిరణ్, మహేందర్, కనకరాజ్, వెంకటేశ్ ఉన్నారు.



కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- ప్రభుత్వ దవాఖానలో ఒక్క నెలలోనే 140కి పైగా కేసులు
- జిల్లాలో ఇప్పటి వరకు 52 మందికి..
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- ప్రత్యేక చర్యల్లో వైద్యాధికారులు
- పెరుగుతున్న పేషెంట్లు

# వామ్మో డెంగ్యూ

**సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగ్యూ మహమ్మారి కోరలు చాస్తోంది. ప్రభుత్వ దవాఖానల్లో ఔట్ పేషెంట్లు విపరీతంగా వస్తుండగా, ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా పెరుగుతోంది. వ్యాధుల బారిన పడుతున్న జనాలతో ప్రభుత్వ దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చి కరీంనగర్ దవాఖానల్లో టెస్టులు చేయించుకోగా ఈ ఒక్క నెలలోనే 140 మందికిపైగా డెంగ్యూ పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. జిల్లాలో మాత్రం 21 కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తానికి విషజ్వరాలు, డెంగ్యూ వాధిగ్రస్తుల సంఖ్య జిల్లాలో నానాటికీ పెరుగుతోంది.**

కరీంనగర్, జూలై 28 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్ : ప్రతి వర్షాకాలంలో వచ్చే వ్యాధులతో జిల్లా ప్రజలు ఆందోళనకు చెందుతున్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో వ్యాధులు విజృంభిస్తుండగా, ముఖ్యంగా డెంగ్యూ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అతిసార, మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. దీనికి తోడు ప్రైవేట్ దవాఖానలు రోగులను భయానికి గురిచేయడం జిల్లాలో పరిపాటిగా మారింది. తక్కువ ఖర్చుతో నయమయ్యే వ్యాధులకు రూ.లక్షలకు లక్షలు గుంజి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ దవాఖానల నుంచి వైద్య, ఆరోగ్య శాఖ ఎప్పటికప్పుడు వివరాలు తెప్పించుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ అది ఆచరణలో మాత్రం నామ మాత్రంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మరో పక్క డెంగ్యూతో ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రోగులతో కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖాన నిండిపోతున్నది. సాధారణంగా ఈ దవాఖానకు ప్రతి రోజూ వెయ్యి మంది ఔట్ పేషెంట్లుగా వస్తారు. కానీ, ఇప్పుడు ఈ సంఖ్య మరింత పెరిగింది. జ్వరంతో వచ్చిన వారికి వివిధ వైద్య పరీక్షలు చేస్తే ఇందులో పెద్ద సంఖ్యలో డెంగ్యూ కేసులు బయటపడడం ఆందోళన కలిగిస్తోంది. గత మూడు నెలల్లో డెంగ్యూ కేసులను పరిశీలిస్తే ఈ ఒక్క నెలలోనే పెద్ద సంఖ్యలో పెరిగాయి. మేలో కేవలం 5 కేసులు మాత్రమే నమోదుకాగా, జూన్‌లో 17 కేసులు నమోదయ్యాయి. ఈ నెలలో ఏకంగా 140 కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘఢ్ వంటి రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఈ దవాఖానకు వచ్చి చికిత్స పొందుతున్నారు. కాగా, జిల్లాలో గత జనవరి నుంచి చూస్తే 52 డెంగ్యూ కేసులు నమోదైనట్లు, ఈ నెలలో 21 కేసులను గుర్తించి చికిత్స చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### పెరుగుతున్న విష జ్వరాలు

జిల్లాలో వారం పది రోజులుగా విష జ్వరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ దవాఖానలకు ఔట్ పేషెంట్లు పెరుగుతున్నారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానలో ప్రతి రోజూ 1,300 నుంచి 1,400 మంది వస్తున్నారు. జిల్లాలోని 18 ప్రాథమిక, 6 అర్బన్ హెల్త్ సెంటర్లలో ఒక్కో చోట వందకుపైగా ఔట్ పేషెంట్లు వస్తున్నారు. హుజూరాబాద్ ఏరియా దవాఖానలో 400 నుంచి 450, జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 300 నుంచి 350, 4 బస్తీ దవాఖానలు, 97 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఇతర ప్రభుత్వ హెల్త్ సెంటర్లలో కలిపి చూస్తే రోజుకు 8 వేల నుంచి 9 వేల మంది జ్వరాలు, దగ్గు, జలుబు ఇతర వ్యాధులతో బాధపడుతూ వస్తున్నారు. సీజనల్ వ్యాధులపై అధికారులు ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో మండల వైద్యాధికారి, హెల్త్ సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంతోపాటు ఆశా వర్కర్లు ఉంటారు. జిల్లా స్థాయిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి నేతృత్వంలో కూడా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఈ బృందాలు ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే పాటించాల్సి ఉంటుంది. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి.



మందులు తీసుకునేందుకు క్యూ కట్టిన ఔట్ పేషెంట్లు

### అంతంత మాత్రంగానే అవగాహన

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గత ప్రభుత్వ హయాంలో అనేక ముందస్తు చర్యలు తీసుకునేవారు. వ్యాధులు రాకుండా ముందుగానే ప్రజలను అప్రమత్తం చేస్తూ పలు కార్యక్రమాలు చేపట్టేవారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించక పోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిసరాలల్లోని చెత్తా చెదారాన్ని ఊరికి దూరంగా డంప్ యార్డులో వేసే వారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో పారిశుధ్యంపై అంతగా శ్రద్ధ పెట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా పంచాయతీలకు నిధులు లేక పోవడంతో అనేక గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో సమకూర్చిన ట్రాక్టర్లు కూడా మూలన పడ్డాయి. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించేందుకు గ్రామాల్లో ప్రజలను సమీకరించే నాయకత్వం లేకుండా పోయింది. దీంతో అనేక గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. వారం పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇపుడు ఎక్కడ చూసినా పరిసరాలు దోమలకు నిలయంగా మారాయి. తాగునీరు కలుషితమవుతోంది. దీనిపై స్థానికంగా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ నేపథ్యంలోనే ఈసారి వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా గ్రామాలు, పట్టణాల్లో క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.

### జ్వర పీడితుల కోసం ప్రత్యేక వార్డు



జ్వర పీడితుల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. రోజురోజుకూ పెరుగుతున్న సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ దవాఖానలోనే డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. పాజిటివ్ వచ్చిన వారికి అవసరమైన వారికి ఎస్‌డీపీలు, ఆర్‌డీపీలు, మందులు పూర్తి స్థాయిలో ఉన్నాయి. సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. వానకాలం కావడంతో ప్రజలు పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకొని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోనేందుకు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి.

**- జీజీహెచ్ సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి**



ఓటీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

## ఒక్క నెలలోనే రెండుసార్లు కాలిపాయె..!



గౌరెపల్లి గ్రామంలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న బాధిత రైతులు

.. ఈ ఫొటోలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిల్చుండి చూస్తున్న వారు రైతులు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గౌరెపల్లి గ్రామానికి చెందిన ఈ 100 కేవీ కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్ ఈ ఒక్క నెలలోనే రెండు సార్లు కాలిపోయింది. దీంతో దీని పరిధిలో ఉన్న 20 మంది రైతులు మోటర్లు నడుపుకోలేక అవస్థలు పడుతున్నారు. గత 18 రోజుల క్రితం ఒకసారి కాలిపోగా రైతులు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పది రోజుల కిందట దానిని తొలగించి వేరే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. అది కూడా మళ్లీ కాలిపోయింది. దీంతో విసుగు చెందిన సంబంధిత రైతులు ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ ఎదుట నిలబడి తమ సమస్యను పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ వినీత్‌రెడ్డిని వివరణ కోరగా సమస్య వాస్తవమేనని సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు సిబ్బందితో కలిసి వెళ్లి అన్ని రకాలుగా పరిశీలించామని, త్వరితగతిన వేరే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

**- మల్లాపూర్, జూలై 28**

## విద్యుత్ కార్యాలయాల్లో కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లు

- కొత్తగా ఏర్పాటుకు ఎన్పీడీసీఎల్ శ్రీకారం
- వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ
- ఫిర్యాదు స్థితిపై ట్రాకింగ్ సిస్టం



కరీంనగర్ ముకరంపుర, జూలై 28 : వినియోగదారుల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్న ఎన్పీడీసీఎల్ మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యుత్ శాఖలో ఇప్పటికే నిర్వహిస్తున్న విద్యుత్ ప్రజావాణికి మంచి స్పందన వస్తున్నది. ఈ క్రమంలో సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సరికొత్తగా విద్యుత్ కార్యాలయాల్లో కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వినియోగదారుడి నుంచి ఫిర్యాదును స్వీకరించిన వెంటనే త్వరితగతిన పరిష్కరించే దిశగా సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ను అమలు చేస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. వినియోగదారులు అన్ని రకాల విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఏదైనా ఒక సర్కిల్, లేదా డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో సంప్రదించి ఫిర్యాదు చేసి రసీదు పొందవచ్చు. నిర్ణీత కాల వ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను నియమించారు. ఫిర్యాదు దారు తన ఫిర్యాదు స్థితిగతులను ట్రాక్ చేసుకొనే వీలుంటుంది. ఫిర్యాదు పరిష్కారంపై సంతృప్తి చెందినట్లయితే తిరిగి మళ్లీ ఫిర్యాదు నమోదుకు ఆవకాశం కల్పించారు. వినియోగదారుడి ఫిర్యాదు పరిష్కారం అయ్యేంత వరకు ఫిర్యాదు మూసివేత ఉండదు. కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లో నమోదైన ఫిర్యాదు స్థాయిని బట్టి డీఈ, ఎస్ఈ, కార్పొరేట్ కార్యాలయం ద్వారా పర్యవేక్షణ చేస్తూ వినియోగదారులకు పూర్తి స్థాయిలో సేవలందించేలా సీఎండీ కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లను తీర్చిదిద్దారు.

## ఈ అనాథలకు దిక్కెవరు..?



అనాథలైన అభిలాష్, మనీషా

.. ఈ చిత్రంలో దీనంగా కనిపిస్తున్న అన్నాచెల్లెళ్లు అభిలాష్, మనీషా. ఊరు కాల్వశ్రీరాంపూర్ మండలం ఆశన్నపల్లె. తల్లిదండ్రులు అయిలయ్య, భాగ్యమ్మ ఆరు నెలల వ్యవధిలోనే మృతిచెందారు. ఇల్లడుగు స్థలం తప్ప గుంట భూమి కూడా లేదు. తల్లిదండ్రులిద్దరూ కూలీ నాలీ చేసుకుంటూ పిల్లలను పోషించేవారు. కొంత కాలంగా సాఫీగా సాగిన వారి కుటుంబాన్ని విధి వెక్కిరించింది. తండ్రికి క్యాన్సర్ రాగా, వైద్యం కోసం దవాఖానల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి ఆరు నెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లే అన్నీతానై కూలీనాలీ చేసి ఇద్దరు పిల్లలను పోషిస్తూ వచ్చింది. భర్త చనిపోయిననాటి నుంచే మనోవేదన చెందుతున్నది. ఇటీవలే ఆరోగ్యం క్షీణించి మంచంపట్టింది. నాలుగు రోజుల క్రితం పరిస్థితి విషమించి మృతిచెందగా, పిల్లలు అనాథలయ్యారు. అభిలాష్ పెగడపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతుండగా, మనీషా ఏడో తరగతి చదువుతున్నది. నా అనే వారు లేక, కనీసం ఉండడానికి సరైన ఇల్లుకూడా లేకపోవడంతో పూరిగుడిసెల్లోనే బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. పిల్లలను ఆదుకోవాలని, జీవితాలకు భరోసా ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. కదురు రాజిరెడ్డి నంబర్(9963088736)కు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా సాయం చేయాలని కోరారు.

**- కాల్వశ్రీరాంపూర్, జూలై 28**

# 'దేవాదాయ'లో బదిలీల సందడి



- ఏసీతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం
- గ్రేడ్-1 ఈవో ఒకరు, గ్రేడ్ -2 ఈవోలు ముగ్గురు
- ప్రమోషన్ల కోసం జూనియర్ అసిస్టెంట్లు
- కాంట్రాక్ట్ సిబ్బందికి రెగ్యులర్ అవకాశాలు దక్కేనా?

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూలై 28: దేవాదాయ శాఖలో బదిలీల సందడి నెలకొంది. కరీంనగర్‌లోని అసిస్టెంట్ కమిషనరేట్ పరిధిలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆలయాల నిర్వహణ సాగుతుండగా, ఏసీతోపాటు పెద్ద సంఖ్యలో జూనియర్ అసిస్టెంట్ల ట్రాన్స్‌ఫర్‌కు రంగం సిద్ధమవుతున్నది. బదిలీల్లో భాగంగా ఇదే టైంలో అర్చకులకూ స్థానం చలనం కలిగించాలని భావించినా, వారి నుంచి వ్యతిరేకత రావడంతో దేవాదాయ శాఖ వెనక్కితగ్గినట్లు తెలుస్తున్నది. అలాగే, 40 శాతం పాత ఉద్యోగులను ఉంచాలనే నిబంధనను పక్కనపెట్టినట్లు తెలుస్తున్నది. దేవాదాయ శాఖలో కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారికే ఎన్నోఏండ్లుగా కొండగట్టు ఆలయ ఈవోగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నది. అందుకు గ్రేడ్-1 స్థాయి అధికారులు అందుబాటులో లేకపోవడమే కారణంగా చూపుతున్నారు. ఇక్కడ గత నాలుగేండ్లుగా అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారికి సైతం బదిలీ కానుండగా, జిల్లాకు చెందిన ఒక అధికారి ఇన్‌చార్జి ఏసీగా బాధ్యతలు తీసుకునేందుకు వెళ్తున్నట్టు తెలిసింది.

### శాశ్వత ఈవోలు వచ్చేనా?

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రేడ్-1, గ్రేడ్-2 స్థాయి ఆలయాలు ఎక్కువగా ఉన్నాయి. అందులో కరీంనగర్ జిల్లాలో ఇల్లందకుంట రామాలయంతోపాటు మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి ఆలయం, పాత బజార్ శివాలయం లాంటి ఆలయాలు ఉన్నాయి. అయితే, జిల్లాలో ఒకే ఒక గ్రేడ్-1 స్థాయి ఉండగా, ఆయన ఇల్లందకుంట ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన్ను జిల్లా కేంద్రంలోని ఆలయానికి కేటాయించి, పలు ఆలయాలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో గ్రేడ్-2 ఈవోలు ముగ్గురు ఉండగా, మరొకరికి పదోన్నతి లభించింది. ఆయనతో గ్రేడ్-2 ఈవోలు నలుగురు కాగా, వారికి జిల్లా కేంద్రంలోని గ్రేడ్-1, గ్రేడ్ -2 స్థాయి ఆలయాలను కేటాయించి మరికొన్ని ఆలయాలకు ఇన్‌చార్జిలుగా నియమించనున్నారు. ఈ మేరకు వారి నుంచి ఇప్పటికే ఆప్షన్లు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ లేఖలు తీసుకున్నట్లు సమాచారం. అయితే, పెద్ద ఆలయాలకు శాశ్వత ఈవోలు వచ్చే అవకాశాలు తక్కువ ఉన్నాయి.

### ప్రమోషన్ల కోసం ఉన్న జూనియర్ అసిస్టెంట్లు

జిల్లాలోని పలు ఆలయాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. వారికి పదోన్నతులు లభిస్తే వారు ఆలయాలకు గ్రేడ్-3 స్థాయి ఈవోలుగా అవకాశం లభించనుంది. అయితే, పదోన్నతులు పూర్తయిన తర్వాత బదిలీల ప్రక్రియ ప్రారంభించాలని కోరుకున్నా, అది జరగక పోవడంతో వారు ఒక దశలో నిరాశతో ఉన్నారు. అలాగే, జూనియర్ అసిస్టెంట్లు, క్లర్క్‌ల విషయంలో దాదాపు పూర్తి స్థాయిలో బదిలీ చేయనున్నట్లు తెలుస్తున్నది. ఇందులో పెద్ద సంఖ్యలో క్లర్క్‌లు పదేండ్లుగా అవే ఆలయాల్లో విధులు నిర్వహిస్తుండగా, వారికి బదిలీలు తప్పవని తెలుస్తోంది. అయితే, క్లర్క్‌ల బదిలీలు శనివారం సాయంత్రం జరగాల్సి ఉన్నా అవి తాత్కాలికంగా సోమవారానికి వాయిదా పడినట్లు సమాచారం.

### కాంట్రాక్ట్ సిబ్బందికి రెగ్యులర్ అవకాశాలు దక్కేనా..!

ఉమ్మడి జిల్లా పరిధిలో పలు ఆలయాల్లో కాంట్రాక్ట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో క్లర్క్‌లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని రెగ్యులర్ చేసేందుకు గతంలోనే వివరాలు సేకరించారు. అందుకు తెలంగాణ రాష్ట్ర అవతరణ నుంచి కటాఫ్‌గా పరిగణించి నియామకాలు నిలిపివేశారు. అయితే, గతం నుంచి తాము ఆలయాల సేవలో ఉన్నామని, తమనూ రెగ్యులర్ చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.





